
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	520.20 (149.6410)	58,578	900
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.45 (3.56)	68.78	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	156.035 (21.215)	నిల్	4,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.190	స్కిన్‌లెస్ : రూ.210

పోషకాహార లోపంతో ఎవరూ అనారోగ్యం పాలు కావొద్దన్న ఉద్దేశంతో అంగన్‌వాడీకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా కడుపులో బిడ్డ పడిన దగ్గరి నుంచి పెరిగి పెద్దయి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకూ బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. చిన్నారులతోపాటు వారి తల్లులకు కూడా నాణ్యమైన ఆహారం ఇస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా ఇక నుంచి ముఖ గుర్తింపు విధానాన్ని తీసుకొస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పడనుంది.

- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)



అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్



- నకిలీ లబ్ధిదారుల తొలగింపే లక్ష్యంగా ఫేస్ రికగ్నైజేషన్
- పారదర్శక సేవలకు శ్రీకారం

కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు చెక్ పడనుంది.అవకతవకలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలనుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలతోపాటు గర్భిణులు, బాలింత మహిళలకు నెలనెల పౌష్టికాహారం అందించే సమయాల్లో ఫేస్ రికగ్నైజేషన్ (ముఖం ఆధారిత గుర్తింపు)ను తప్పనిసరి చేసింది. కేంద్రాల్లో నకిలీ లబ్ధిదారులను తొలగించి అర్హులైన వారికి మాత్రమే పౌష్టికాహారం అందించి పారదర్శకత పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఈవిధానాన్ని తీసుకొచ్చింది.దీనికోసం ఇప్పటికే పోషణ్ ట్రాకర్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

సెల్‌ఫోన్ ద్వారా ఫేస్ క్యాప్చర్

ఆయా అంగన్‌వాడీకేంద్రాల్లోని లబ్ధిదారులకు సంబంధించిన ఫొటోలు తీసి ఆధార్, కేవైసీ వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. వారికి అందిస్తున్న పోషకాహారం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతీనెల లబ్ధిదారుడు కేంద్రానికి వచ్చిన తర్వాత ముఖ గుర్తింపు హాజరు తీసుకుని ఆహారం పంపిణీచేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ఏ సరుకులు పంపిణీ చేశారో నేరుగా లబ్ధిదారుల సెల్‌ఫోన్‌లకు సమాచారం వెళ్లేలా యాప్‌ను రూపొందించారు. తద్వారా పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టేందుకు అవకాశం ఉంది. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం ముఖం ఆధారిత గుర్తింపు

-మిగతా 6వ పేజీలో...

పకడ్బందీగా అమలు చేస్తాం: శైలజ, సీడీపీవో



కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేస్తాం. ఈ మేరకు అన్ని కేంద్రాల్లో ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే 70నుంచి 80శాతం పూర్తి చేశాం. ఆధార్ గుర్తింపులో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేసేలా సిబ్బందికి సూచించాం. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విధానంతో పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు మాత్రమే అందే ఆస్కారం ఉంది.

గురుకులాల్లో ఫోన్‌మిత్ర

వివిధ సంక్షేమశాఖలకు చెందిన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇంటిమీద బెంగతో కొంతమేర ఇబ్బందులు పడుతుంటారు. మరికొందరు తల్లిదండ్రులతో ఉన్న అనుబంధం కారణంగా వారితో మాట్లాడలేక, వారిని విడిచి ఉండలేక ఇంటిదారి పడుతుంటారు. కొంత మంది కళాశాలల్లో ఒంటరితనాన్ని భరించలేక, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకుని ఫోన్‌మిత్ర కార్యక్రమానికి ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో శ్రీకారం చుట్టారు. దీంతో విద్యార్థుల్లో భయం పోగొట్టడం, ఇంటిపైన బెంగ నుంచి విముక్తి కల్పించనున్నారు. అందుకోసం యాక్సిస్ బ్యాంకుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొని, గురుకుల కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రకారం ఫోన్లు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట (కలెక్టరేట్)


సూర్యాపేట బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటుచేసిన ఫోన్ ద్వారా మాట్లాడుతున్న విద్యార్థినులు

- ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు
- ప్రతీ విద్యార్థికి స్మార్ట్‌కార్డ్
- ఫోన్‌మిత్రతో విద్యార్థుల్లో తొలగనున్న ఇంటిబెంగ

ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఫోన్‌మిత్ర పథకాన్ని ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మొదటగా హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి గురుకులంలో ఏర్పాటు చేయగా, సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలోని ఎనిమిది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 'ఫోన్‌మిత్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఒక్కో గురుకుల కళాశాలలో 640 మంది విద్యార్థులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో ఐదు బాలికల, మూడు బాలుర ఎస్సీ గురుకులాలు ఉండగా, ఈ గురుకులాల్లో మొత్తం 5వేల మందికిపైగా విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు.

స్మార్ట్‌కార్డ్‌లో ముందుగానే ఫోన్ నెంబర్లు



గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసించే ప్రతీ విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ అందించారు. అందులో ముందుగానే విద్యార్థి తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒకరి ఫోన్ నెంబరుతో పాటు గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి నెంబర్‌ను ముందుగానే ఫీడ్ చేశారు. విద్యార్థులు స్మార్ట్‌కార్డ్ ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం ఉంటుంది. ఫోన్లు చేసినందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. గురుకులాల్లోని ప్రతీ 100మంది విద్యార్థులకు ఒక ఫోన్ చొప్పున ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రతీ రోజు వారికి అవసరం అనుకుంటే సాయంత్రం కళాశాల తరగతులు ముగిసిన అనంతరం 4.30 నుంచి రాత్రి 7గంటల వరకు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసుకునే అవకాశం ఉంది. గతంలో క్లాస్‌టీచర్ (హౌస్ పేరెంట్ టీచర్) ఫోన్ ద్వారా మాత్రమే ఎప్పుడో ఒకసారి అత్యవసరం అనుకుంటే మాత్రమే ఫోన్ సదుపాయం ఉండేది. ఇప్పుడు ప్రతీ రోజు మాట్లాడుకునే అవకాశం కల్పించారు. అదే విధంగా కళాశాలల్లో ఏమైనా సమస్యలు ఉన్నా వెంటనే గురుకులాల రాష్ట్ర కార్యదర్శికి

- మిగతా 6వ పేజీలో...

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్



తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దఅడిశర్లపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మూడు నెలలు డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎన్‌సీ రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్, ఓపీ, మాతా శిశు మరణాల రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడంతో వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి భూభారతి కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నోటీసుల వివరాలను తహసీల్దార్ జయశ్రీ అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు, ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. పెద్దగట్టు సర్వేనెంబర్ 23 వివాదంపై రైతులు దరఖాస్తులు చేసుకోగా, ఆ సర్వే నెంబ్‌ను ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీచేసి ఆ సమయంలో ఎస్‌వో లేకపోవడంతో అక్కడున్న సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి, పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ, ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి: ఎస్పీ


డ్యూటీ మీట్‌లో పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన జోనల్ స్థాయి డ్యూటీ మీట్‌లో ఆయన మాట్లాడారు. రోజు రోజుకూ పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కేసుల దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధనలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ తదితర అంశాల్లో పట్టు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలి

వర్షాకాలం నేపథ్యంలో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు సమర్థంగా విధులు నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం ట్రాఫిక్ పోలీసులకు రెయిన్ కోట్స్, షూస్, గొడుగులు, రేడియం రిఫ్లెక్టివ్ జాకెట్స్, కళ్లద్దాలు, తదితర వస్తువులు సిబ్బందికి అందజేసి మాట్లాడారు. ట్రాఫిక్ పోలీసులు విజబుల్ పోలీసింగ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తారని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. అప్పుడే ప్రజల్లో పోలీసులపై గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం విధినిర్వహణలో మృతిచెందిన ముగ్గురు హోంగార్డు కుటుంబ సభ్యులకు హోంగార్డు సంక్షేమ నిధుల నుంచి రూ.15వేలు, అనారోగ్య కారణంగా చికిత్స పొందిన ఐదుగురు హోంగార్డ్స్‌కు రూ.10వేలు, పిల్లల వివాహం కోసం ఇద్దరు హోంగార్డులకు రూ.5వేలు, మెరిట్ స్కాలర్‌షిప్ ముగ్గురికి రూ.5వేలు చెక్‌లను ఎస్పీ అందజేశారు. కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, నరసింహాచారి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీను, సంతోష్, హరిబాబు, సూరప్పనాయుడు, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి స్టేషన్‌ను తనిఖీచేసిన ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): కొండమల్లేపల్లి స్టేషన్‌ను బుధవారం అర్ధరాత్రి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో నేర నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాల ప్రాముఖ్యం, సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, దొంగతనాల కట్టడికి పెట్రోలింగ్ చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, ఉమెన్స్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, వివరాలను పరిశీలించారు. ఆయన వెంట సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రధాన కాల్వకు మరమ్మతులెన్నడో?

- ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ పనులకు రూ.442 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- కాల్వ పూర్తి చేయాలంటున్న ఆయకట్టు రైతులు


ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ కోతకు గురై పెరిగిన కంపచెట్లు

దేవరకొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతోపాటు 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు 2001లో ప్రారంభించినప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. ఏఎమ్మార్పీ పుట్టంగండి నుంచి ఉదయ సముద్రం వరకు 136 కిలోమీటర్ల మేర కాల్వ విస్తరించి ఉంది. దీంతోపాటు డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలు కంపచెట్లు పెరిగి నీరు వృథాగా పోయే పరిస్థితి నెలకొంది. నాలుగు మోటర్లు నడిస్తే నీరు వృథా పోతుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు మోటర్ల ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడమే లక్ష్యంగా ప్రాజెక్టును ప్రారంభించారు. ఏఎమ్మార్పీ కాల్వలకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. అధికారులు ప్రతి సంవత్సరం ప్రతిపాదనలు పంపుతున్నారే తప్ప మరమ్మతులు చేయడం లేదు.

కాంగ్రెస్ హయాంలో నిధులు మంజూరు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌లు దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం, ఏఎమ్మార్పీ, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులపై దృష్టి సారించారు. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచని ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం రూ.442 కోట్లు కేటాయించింది. కానీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తుండడం, శ్రీశైలం నుంచి సాగర్ నీటి విడుదల ప్రారంభమైంది.

మరమ్మతులు పూర్తయితే చివరి వరకు నీరు

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 136 కిలోమీటర్ల మేర సీసీలైనింగ్ పనులు, కంపచెట్ల తొలగింపు, మరమ్మతులు పూర్తయితే చివరి భూములకు సాగునీరు అందనుంది. ప్రభుత్వం టెండర్లు పిలిచి మరమ్మతులు పూర్తిచేసి లీకేజీలను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు ప్రభుత్వం రూ.442 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్లు పూర్తయితే మరమ్మతులు ప్రారంభమవుతాయి. నీరు వృథా కాకుండా చర్యలు చేపడుతున్నాం.

- సత్యనారాయణ, ఏఎమ్మార్పీ ఈఈ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్
- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



మిర్యాలగూడలో డీఏవో శర్మకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదలకోసం కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఏవో శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వాల భిక్షకాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా రూ.7200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. నిధులు లేవంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు నిధులు చెల్లిస్తున్నా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రపంచ అందాల పోటీలకు రూ.200కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలే పవన్, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి, నాయకులు ఎస్‌కే సోయల్, మాధవి, స్వాతి, ఉమామహేశ్వరి, స్వప్న, రాజు, వెంకటేష్, ప్రభాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జ్వాలా వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల కన్వీనర్ బీసం రామయ్య, విద్యావంతుల వేదిక నాయకులు హరి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బొంగరాల నర్సింహనాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన

నార్కట్‌పల్లి: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడానికి నిరసనగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాందేవ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి పక్కా భవనం నిర్మించాలని రెండేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జీవో నెం.29ని రద్దుచేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షా యాభైవేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, కావటి సత్యనారాయణ, మల్లేశ్, శిరీష, వైష్ణవి, రమాదేవి, సుకుమార్, వారాహి, మనీషా, మానస పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. ఎవరైనా ఎమ్మార్పీకి మించి అధిక ధరకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, నాసిరకానికి చెందినవి విక్రయించినా చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు చేయాలన్నారు. రైతులు చేసిన ప్రతీ కొనుగోలుకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మండలంలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎక్కువ మొత్తంలో కాకుండా అవసరం ఉన్నంతవరకే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఎ.శివరాంకుమార్, తదితరులు ఉన్నారు.

వారంలో సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 3 (ఆంధ్రజ్యో తి): యాసంగి 2023-24కు సంబంధించి మిగిలి న కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని వా రంలోపు పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ జిల్లా రైస్ మిల్లర్లను ఆదేశించారు. రైస్ మిల్లర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 యాసంగి సీఎంఆర్‌కు సంబంధించి ఇంకా 73 ఏసీకే చెల్లించాల్సి ఉందన్నారు. మిల్లర్లు వారం రోజుల్లో ఈ మొత్తాన్ని చెల్లించడంతోపాటు, 2024-25 యాసంగికి సంబంధించిన సీఎంఆర్‌ను సైతం వేగవంతం చేయాలన్నారు. సీఎంఆర్ చెల్లింపులో నిర్లక్ష్యం చేయవద్దని, పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు దీన్ని నిత్యం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికా రి వెంకటేశం, జిల్లా మేనేజర్ హరీష్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాస్, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నాణ్యమైన భోజనం అందించాలి

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో అంతకుముందు నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ బూత్‌స్థాయి అధికారుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, డీటీ మల్లిఖార్జున, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజాపాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఈ నెల 14న తిరుమలగిరిలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ సన్నాహక సమావేశం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా దివాళా తీయించారన్నారు. ఈ నెల 14న తిరుమలగిరిలో నూతన రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సీఎం సభకు పెద్దఎత్తున అన్ని గ్రామాల నుంచి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, సింగిల్ విండో చైర్మన్ తాల్లూరి మురళి, జిల్లా కార్యదర్శి గూని వెంకటయ్య, నాయకులు వేముల గోపినాథ్, నోముల రవి కుమార్, బొల్లికొండ గణేష్, బోడ అరుణ్ కుమార్, షేక్ ఇబ్రహీం, బండెల శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ నిధులతోనే చండూరులో పనులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

చండూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : చండూరు పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులేనని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా చండూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఒక్కరూపాయి అభివృద్ధి జరగలేదన్నారు. ఆ పార్టీ వారి అవినీతిని ప్రశ్నించిన వారిపై అక్రమకేసులు పెడుతోందని, తాజాగా చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ ఇల్లు కూల్చి వేశారన్నారు. తమ కార్యకర్తలపై అక్రమకేసులు బనాయించి ఓట్లు వేయించుకుందామని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అరాచకాలకు అడ్డూలేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, చండూరు మునిసిపల్ మాజీ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం, రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, కొత్తపాటి సతీష్, పెదగోని వెంకన్న, కురుపాటి సుదర్శన్, తేలుకుంట్ల చంద్రశేఖర్, తేలుకుంట్ల జానయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాచరిక, రాక్షసపాలన



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రాచరిక, రాక్షస పాలన కొనసాగుతోందని, ప్రశ్నించేవారిపై కేసులు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్‌వ్యవస్థను ఉపయోగించి గ్రామాల్లో ప్రశ్నించిన నాయకులపై కేసులు పెడుతూ కాంగ్రెస్ నాయకులు భయాందోళనకు గురిచేస్తున్నారు. తాము ఉద్యమం నుంచి వచ్చామని, ఇవి కొత్తేమి కాదని, ఎలాంటి కేసులకైనా భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇక నుంచి ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అయితగోని వెంకన్నగౌడ్, మాజీ అధ్యక్షులు కట్టా వెంకటరెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజలాల్ శేఖర్ బాబు, దుబ్బ వెంకన్న, జేరిపోతుల చంద్రమౌళి, అక్కినేపల్లి శ్రీరాములు, భూపతి ఉపేందర్, శేషరాజపల్లి వెంకన్న, పాక రాములు, మహేశ్వరం వెంకన్న, గుండ్ల వెంకన్న, చివుట సైదులు, రాపాక రాజు, నిమ్మల సురేష్, తీగల వెంకన్న, రాచకొండ గణేష్, కమలాకర్, చీమల శ్రవణ్ కుమార్, నోముల శ్రీనివాస్, చింతల శంకర్, జలందర్, బడేసాబ్ తదితరులు ఉన్నారు.

చేనేత రుణమాఫీ!

● ప్రస్తుతం రూ.లక్ష లోపు రుణాలకే ● రూ.33 కోట్లు మంజూరు ● ఉమ్మడి జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం ● కార్మికుల్లో ఆనందోత్సాహాలు



రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు శుభవార్త అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రుణమాఫీని అమలుచేస్తూ, ఈ పథకం కోసం రూ.33 కోట్లు విడుదల చేసింది. దీంతో చేనేత కార్మికులకు గొప్ప ఆర్థిక ఊరట లభించింది. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న కార్మికులందరికీ లబ్ధి చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా 6,600 మంది చేనేత కార్మికులు ప్రయోజనం పొందుతుండగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,326 మందికి రూ.26.68 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

చేనేత కార్మికులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. కార్మికులను రుణవిముక్తులను చేస్తూ 2025-26 బడ్జెట్ నుంచి రూ.33కోట్ల నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలకే మాఫీ వర్తిస్తుంది. చేనేత వృత్తిపై తీసుకున్న రుణాలు, చేనేత వస్త్రాల ఉత్పత్తికి, వృత్తి సంబంధ కార్యకలాపాలు, ముద్ర రుణాలన్నింటికీ మాఫీ కానున్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఆయా బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 1,162 మంది చేనేత కార్మికులకు రూ.8.04 కోట్ల రుణమాఫీ జరుగనుంది. వీరితోపాటు మరో 1,560 మంది రూ.లక్షకు పైగా రుణాలు తీసుకున్నారు. వీరికి సైతం రూ.15.60 కోట్లు రుణమాఫీ వర్తించనుంది. యాదాద్రి-భువనగిరి జిల్లాలో మొత్తం 2,722 మంది కార్మికులకు రూ.23.64కోట్ల రుణవిముక్తి లభించనుంది. అయితే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి మొత్తం 604 మంది చేనేత కార్మికులకు రూ.3.04 కోట్ల రుణమాఫీ కానుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,326 మంది చేనేత కార్మికులకు రూ.26.68 కోట్ల రుణమాఫీ జరుగనుంది.

చేనేత రుణమాఫీపై సర్కారు తిరకాసు!

చేనేత రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తిరకాసు పెడుతోంది. అసలుకే మాఫీ చేసి, మిత్తికి మంగళం పాడేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు చేనేత రుణమాఫీపై జరుగుతున్న కసరత్తులో ఈ విషయం వెల్లడైంది. దీంతో రూ.లక్ష లోపు రుణాలు పొందిన చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల నుంచి పొందిన రుణంలో అసలు రూ.లక్ష వరకు మాత్రమే మాఫీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు సమాచారం. అసలుపై పెరిగిన వడ్డీని రుణగ్రహీత తిరిగి బ్యాంకులకు చెల్లిస్తేనే రుణం పొందిన అసలు సొమ్ము మాఫీ జరుగుతుందని అధికారులు తేల్చి చెబుతున్నారు. ఉదాహరణకు ఒక కార్మికుడు బ్యాంకు నుంచి రూ.90వేలు రుణం తీసుకుంటే దానికి వడ్డీ రూ.25 వేలు అయింది. అసలు వడ్డీ కలిపితే రూ.1.15 లక్షలు అవుతుంది. అయితే బ్యాంకు నుంచి పొందిన రుణం రూ.90వేలకు మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని సమాచారం. వీడ్డ మొత్తం రూ.25వేలు కార్మికుడు చెల్లించాల్సి ఉంటుంది. మిగతావారికి కూడా అసలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుండగా, వడ్డీ కార్మికులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏదేమైనా ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేయడంపై కార్మికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేరుగా ఖాతాల్లోనే జమవుతాయి



రూ.లక్షలోపు ఉన్న రుణాలున్నవార ందరికీ రుణమాఫీ అవుతుంది. రూ.లక్ష కంటే ఎక్కువ ఉన్న రుణమొత్తాన్ని చెల్లిస్తే వారికి రుణమాఫీ వర్తిస్తుంది. రూ.లక్షలోపు రుణం ఉన్నవారికి గడువులో చెల్లించిన వారికి ప్రయోజనకరం. రుణమాఫీ డబ్బులు నేరుగా చేనేత కార్మికుల ఖాతాలో జమవుతాయి.

శ్రీనివాస్‌రావు, చేనేత, జౌళిశాఖ ఏడీ, యాదాద్రిజిల్లా

రుణవిముక్తి కలగనుంది



మూడేళ్ల క్రితం కెనరాబ్యాంకులో రూ.2లక్షలు రు ణం తీసుకున్నా. గతేడాది వరకు కిస్తులు కట్టా. ప్రస్తుతం అసలు, వడ్డీ కలుపుకుని రూ.1.90 లక్షల రుణం ఉంది. అయితే రూ.లక్ష మాఫీ చేస్తే రుణవిముక్తి కలుగుతుంది. నాలాగే కార్మికులను రుణవిముక్తులను చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

బోగ గణేష్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

రాజుకు ఇల్లు మంజూరు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
● ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించిన ఎమ్మెల్యే

శాలిగౌరారం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు వస్తుందన్న ఆశతో ఉన్న ఇంటిని కూల్చుకున్న నల్లగొండ శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన బట్ట రాజుకు ఎమ్మెల్యే మందుల సామేల్ ఇల్లు మంజూరు చేశారు. కమ్యూనిటీ హాల్‌లో ఉంటున్న రాజు దీనస్థితిపై ఈ నెల 3న ఆంధ్రజ్యోతి పత్రికలో మాటలు నమ్మి, గూడూ తీసేశాడు శీర్షికన కథనం ప్రచురితమైంది. గురువారం శాలిగౌరారంలో ఓ సభకు హాజరైన ఎమ్మెల్యే ఈ కథనాన్ని చదివి రాజుకు ఇల్లు చేయాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మిని ఫోన్‌లో ఆదేశించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపించాలన్నారు. వెంటనే రాజు కుటుంబ సభ్యులు ఎంపీడీవో జ్యోతిలక్ష్మి వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలను తెలిపారు.

'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపిన రాజు

తన కుటుంబ సభ్యుల బాధను వెలుగులోకి తీసుకువచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కారణమైన 'ఆంధ్రజ్యోతి'కి రాజుతో పాటు భార్య రమణ, కుమార్తెలు నాగశ్రీ, భవ్యశ్రీలు కృతజ్ఞతలు తెలిపారు.

10న బుద్ధవనంలో ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవం



బుద్ధవనంలో ఏర్పాటుచేసిన శిష్యులకు బోధనలు చేస్తున్న బుద్ధుడి శిల్పాలు

నాగార్జునసాగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో ఈ నెల 10న గురుపౌర్ణమి సందర్భంగా ధర్మప్రవర్తన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం ముఖ్యఉద్దేశం సిద్ధార్థుడు మొదటిజ్ఞానోదయ సందేశ రోజు అన్నారు. తాను నేర్చుకున్న సత్యాన్ని మొదటిసారిగా శిష్యులైన కొండన్న, మహనామా, పప్పా అప్పాజీ, బాధియాలకు మధ్యప్రదేశ్ రాష్ట్రం సారనాథ్ జింకల వనంలో తెలియజేసిన(ఉపన్యసించిన) రోజు బుద్ధుడి జీవితంలో ముఖ్యమైన ఐదు ఘట్టాలల్లో ఒకటన్నారు. బుద్ధుని మొదటి ఉపన్యాసాన్ని ధర్మచక్ర ప్రవర్తన దినోత్సవంగా బౌద్ధులు నిర్వహించుకుంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 10న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో యాదాద్రిభువనగిరి జిల్లాలో కూలి, సూర్యాపేటలో ఎలక్ట్రీషియన్, నల్లగొండ జిల్లాలో రైతు ఉన్నారు.

మోత్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఏగూరి సుధాకర్(30) గాంధీఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం ఎగూరి స్వరూప కుటుంబం సుమారు 20 ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం మండలంలోని సదర్శాపురం నుంచి మోత్కూరు వచ్చి ఇక్కడే నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్దకుమారుడు హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. స్వరూప ఇళ్లలో పనిచేస్తుండగా చిన్నకుమారుడు సుధాకర్ బ్యాండ్ మేళం వాయించేవాడు. జూన్ 27న సుధాకర్ క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ ...



బిచ్యానాయక్(ఫైల్)

పాలకవీడు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ గురువారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సైదులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సఫావత్ బిచ్యా నాయక్(45) మీగడంపాడుతండాలో ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగుస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రూపావత్ కోట్యా పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు సరిచేసేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బిచ్యానాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కస్తూరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారని ఏఎస్ఐ సైదులు తెలిపారు.


నేరడలో మూర్ఛతో ఊపిరాడక రైతు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

చిట్యాల రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వచ్చిన వ్యక్తి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలో గురువారం జరిగింది. ఎస్ఐ మామిడి రాములు తెలిపిన వివరాల ప్రకారం నేరడకు చెందిన వడ్డెపల్లి సైదులు(40) వ్యవసాయం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. రోజువారీగా పొలంలో పనులు చేస్తూ మూర్ఛతో కిందపడిపోయాడు. పొలంలో ఉన్న బూడిదలో పడిపోగా ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్లిన రైతులు వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. సైదులు భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ ఘట్టం

యాదగిరిగుట్ట, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్యకైంకర్యాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలో ఉత్సవమూర్తులను అలంకరించి గజవాహనసేవ చేపట్టారు. అనంతరం కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి కల్యాణతంతు కొనసాగించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో నిత్యపూజలు, యాగశాలలో నిత్యరుద్రహవనం జరిపించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,95,642 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.

చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి జైలు

కోదాడ టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : అప్పు కింద చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కోదాడ ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడకు చెందిన కొదుమూరి ప్రవీణ్ నుండి రంగాపురపు ఉమామహేశ్వర్ తన అవసరాల నిమిత్తం అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని ప్రవీణ్ కోరగా ఉమామహేశ్వర్ 2014లో రూ.5 లక్షల చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంక్‌లో చెల్లకపోవడంతో ప్రవీణ్ కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణల అనంతరం కేసును విచారించిన ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ భవ్య గురువారం తీర్పు వెలువరించారు. ఇచ్చిన చెక్కు తాలూకా రూ.5లక్షలు ఇవ్వాలని, చెల్లని చెక్కు ఇచ్చినందుకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న సూర్యాపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆరుగురు వ్యక్తులు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తేలిందన్నారు. వారిని గురువారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, మిగిలిన ఐదుగురికి రూ.6500 జరిమానా విధించినట్లు తెలిపారు.

దాడి కేసులో నిందితులకు జరిమానా

నిడమనూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : మహిళపై దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు వెల్లడించారు. కోర్టు లైజన్ అధికారి అలీ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం 2016 ఆగస్టు 31న మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామానికి చెందిన గుడిపాటి లక్ష్మమ్మ తన పశువులకు గడ్డి కోసేందుకు పొలం వద్దకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన గుడిపాటి నవీన్, గుడిపాటి సైదయ్య, గుడిపాటి వెంకమ్మ అనే ముగ్గురు పొలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా గెట్టు పంచాయితీని దృష్టిలో పెట్టుకొని దుర్భాషలాడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. బాధితురాలు అదేరోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ యాలాద్రి నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కాగా గురువారం కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించనిపక్షంలో నిందితులు నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ సైదులు కేసు విచారణకు సహకరించారని లైజన్ అధికారి తెలిపారు.

భూతగాదాల్లో ఘర్షణ, ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో భరత్

పెన్‌పహాడ్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల కుటుంబాల మధ్య భూవివాదం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఎస్ఐ గోపీకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం భక్కాయిగూడెం గ్రామానికి చెందిన శానం వెంకటేశ్వర్లు, రామలింగయ్య అన్నదమ్ములు. వారికి పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామశివారులో వ్యవసాయ భూమి ఉంది. తరచూ సరిహద్దు వివాదాలు జరుగుతున్నాయి. పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టినా వివాదం సమసిపోలేదు. గురువారం రామలింగయ్య కుమారుడు భరత్, భార్య కళమ్మ, శానం వెంకటేశ్వర్లు, ఆయన కుమారులు నాగేంద్రబాబు, లక్ష్మణ్‌రావులు పొలం గెట్ల వద్ద ఘర్షణపడ్డారు. ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో భరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శానం వెంకటేశ్వర్లు కుమారులు నాగేంద్రబాబు, లక్ష్మణ్‌రావులు నల్లగొండ 12వబెటాలియన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భరత్ తల్లి కళమ్మ ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

అక్రమాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో...	
కేంద్రాలు	901
బాలింతలు	3,429
గర్భిణులు	4,511
ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు	21,890
3-6 ఏళ్ల చిన్నారులు	19,535

హాజరు తప్పనిసరి చేశారు. దీంతో కేంద్రాలకు ఎంత మంది వచ్చారో సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీసి కార్యకర్తలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

కేంద్రాల్లో కొనసాగుతున్న ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుంది. జిల్లాలో మొత్తం 901 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, మొత్తం 49,365 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఆరు నెలల నుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు 70నుంచి 80శాతం వరకు ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ పూర్తయింది. గర్భిణులు, బాలింత మహిళలకు పోషన్ ట్రాకర్ అప్లికేషన్‌లో ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతుంది. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు. మరికొన్ని రోజుల్లో ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా లబ్ధిదారులకు ఆహారం అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

యాప్‌లో లబ్ధిదారుల వివరాలు పొందుపరుస్తాం



ఎఫ్ఆర్ఎస్ ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల ఆదేశాలతో లబ్ధిదారుల ఫొటోలను క్యాప్చర్ చేసి వారి ఆధార్‌తో లింక్ చేస్తున్నాం. ఈకేవైసీతోపాటు లబ్ధిదారులకు అందిస్తున్న ఆహారపు వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో పొందుపరుస్తున్నాం.

పి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, బీబీనగర్



సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోన్లు

గురుకులాల్లో ఫోన్‌మిత్ర

(5వ పేజీ తరువాయి)

కూడా ఫోన్‌లో విషయాలను తెలిపే అవకాశం కల్పించారు.

విద్యార్థులకు తొలగనున్న ఇంటిబెంగ

గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసి ఫోన్‌మిత్ర ద్వారా విద్యార్థుల్లో ఉండే ఇంటిబెంగ తొలగిపోతుంది. చాలా మంది విద్యార్థులు ఇంటి మీద బెంగపెట్టుకుని విద్యపై సరిగా దృష్టి సారించలేక ఇబ్బందులు పడుతుంటారు. అదే విధంగా మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులతో దూరంగా ఉన్నామనే భావన ఉంటుంది. ఇంకా కొంత మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఫోన్‌మిత్ర ద్వారా ఇలాంటి సమస్యలకు చెక్‌పడనుంది. వారి తల్లిదండ్రులతో రోజూ మాట్లాడుతుండడం వల్ల మానసికంగా బాగుంటారు. అంతేగాక ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. దీంతో పాటు విద్యార్థుల డ్రాపవుట్స్ కూడా తగ్గనున్నాయి.

'ఫోన్‌మిత్ర' విద్యార్థులకు ఉపయోగకరం



గురుకుల కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఫోన్‌మిత్ర కార్యక్రమం విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. విద్యార్థినులు రోజువారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుకోవడంతో ఎలాంటి ఇబ్బందులకు గురికావడం లేదు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకుంటున్నారు. ఫోన్‌మిత్ర ద్వారా ఇంటిమీద బెంగపోయింది. విద్యార్థినులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటున్నారు. దీంతో విద్యపై దృష్టి సారిస్తున్నారు.

సీహెచ్.పద్మ, ప్రిన్సిపాల్, బాలికల గురుకుల కళాశాల దురాజ్‌పల్లి, సూర్యాపేట

చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

మునుగోడు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం నిర్వహించే చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి కట్టా లింగస్వామి కోరారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మిర్యాల భరత్‌కుమార్, బొడ్డుపల్లి నరేష్, వంశీకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నకిరేకల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాన్న సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు యాతాకుల శేఖర్, వనగండ్ల సైదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చెడిపల్లి కాశీరాం, బీసీపీ బొల్లికొండ లింగయ్య, తిరుగుడు రవి, పుల్లయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

ఎంఈవో వి. పద్మ



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని మండల విద్యాధికారి వి. పద్మ తెలిపారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫాం అందజేశామని పేర్కొన్నారు. గురువారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

● (కనగల్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

ఎంఈవో: ఎంపీపీఎస్, పీఎస్, హైస్కూళ్లు కలుపుకుని మొత్తం 41 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అదేవిధంగా కేజీబీవీ పాఠశాల ఉంది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులందరికీ ఉచిత నోటుపుస్తకాలు, యూనిఫాంలు అందించారా?

ఎంఈవో: అన్ని గ్రామాల పాఠశాలల్లోని విద్యార్థులకు నోటుపుస్తకాలు, యూనిఫాంలు అందజేశాం.

ఆంధ్రజ్యోతి : ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందా?

ఎంఈవో: విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగింది. పాఠశాల ప్రారంభానికి ముందు బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పించారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థుల విద్యా పురోగతికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

ఎంఈవో : త్వరలో సాయకాలం అదనపు క్లాసులు నిర్వహించి అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో తాగునీరు, ఇతర మౌలిక వసతులు ఉన్నాయా..?

ఎంఈవో: అన్ని ప్రభుత్వ పాఠశాలలకు తాగునీరు సరఫరా అవుతుంది. బాత్రూంలు, విద్యుత్, ప్రహరి, వంట గదులు, విశాలమైన క్రీడా స్థలాలు ఉన్నాయి. ఇతర వసతులు ఉన్నాయి.

సమాచారం

సీపీఎం నాయకుడు వీరయ్య మృతి




నకిరేకల్, జూలై3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు తండు వీరయ్య(80) అనారోగ్యంతో మృతిచెందారు. సింగిల్‌విండో డైరెక్టర్‌గా, విద్యాకమిటీ చైర్మన్‌గా, వార్డు సభ్యుడిగా సేవలందించారు. వీరయ్య మృతదేహంపై సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు కందాళ ప్రమీళ, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, బచ్చుపల్లి ప్రకాష్‌రావు, వంటిపాక కృష్ణ, కొప్పుల అంజయ్య, మర్రి యల్లయ్య, బచ్చుపల్లి లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కనగల్, జూలై3.(ఆంధ్రజోతి): మోనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో పద్మ ఆదేశించారు. గురువారం తేలకంటిగూడెం ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమై విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో అభ్యసనను మెరుగు పర్చాలని సూచించారు.

జనార్దన్‌కు భారత్ సేవా విభూషణ్ అవార్డు



నకిరేకల్, జూలై 3,(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన బెల్లి జనార్ధన్ భారత్ సేవా విభూషణ్ అవార్డుకు ఎంపికయ్యారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున అవార్డుకు ఎంపిక చేసినట్ల మనం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. 1996 అక్టోబరు 30 ఈఎంఈకోర్‌లో సోల్జర్ టెక్నికల్‌గా చేరిన ఆయన ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ రక్షక్ లాంటి సైనిక ఆపరేషన్లలో పాల్గొన్నారు. 2016లో వీఆర్ఎస్ తీసుకున్నారు. అప్పటి నుంచి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

వాడిన ఆశలు మొలకెత్తి..

● వర్షాలతో ఎండుతున్న పత్తి మొక్కలకు జీవం



మొలకెత్తిన పత్తి విత్తనాలు

మర్రిగూడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు కురవడంతో రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేసుకున్నారు. విత్తనాలు మొలకెత్తి పైకి ఎదిగే తరుణంలో వర్షాలు లేక మొక్కలు వాడిపోయే పరిస్థితి నెలకొంది. వర్షాలు కురవకపోవడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. పెట్టుబడులు పెట్టి పత్తి విత్తనాలు విత్తితే వరుణ దేవుడు కరుణించలేదు. రోహిణి కార్తెలో ముందస్తుగా వర్షాలు పడడం వల్ల మండలంలో 15శాతం మంది దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు పత్తిసాగు చేసుకున్నారు. మొలకలు వచ్చినప్పటికీ అవి కూడా వర్షాలు లేకపోవడంతో వాడిపోతూ ఎండే స్థితికి చేరుకున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి మొక్కలకు జీవం పోయడంతో రైతుల మోములో ఆనందం కనిపిస్తోంది. మండలంలో ఇప్పటికే 80శాతం మంది రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో 20శాతం మంది రైతులు విత్తనాలు నాటేందుకు సిద్ధమయ్యారు. మండలంలో 28వేల ఎకరాల వరకు పత్తిసాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వస్తున్నారు.

సమస్యలపై అధికారులు అధ్యయనం చేయాలి



నార్కట్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెచ్చేలా పనితీరు ఉండొద్దని సూచించారు. శాఖల వారీగా సమీక్ష చేసిన ఎమ్మెల్యే కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. ఉదయ సముద్రం జలాశయం ప్రధాన కుడి కాల్వకు సంబంధించి జాతీయ రహదారిపై కల్వర్టు నిర్మాణ పనులకు జాతీయ రహదారి విభాగం నుంచి అనుమతి ఇప్పించాలని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బీ.వెల్లెంల ఉదయ సముద్రం జలాశయం నుంచి చెరువులకు నీటిని విడుదల చేయడంపై ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తంచేశారు. నార్కట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు నెలలుగా నిలిచిపో వడంపై అసహనం వ్యక్తం చేశారు. నోటీసులు ఇచ్చినా కాంట్రాక్టర్ స్పందించడం లేదని ఏఈ చెప్పడంతో వెంటనే ఆర్అండ్‌బీ ఎస్ఈకి ఫోన్ చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, ఎంపీడీవో ఉమేశ్‌చారి, తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, సీఐ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. నార్కట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలని బీజేపీ నాయకులు మేడబోయిన శ్రీనివాస్, వడ్డేగోని రామలింగం, నోముల నాగరాజు తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

చిట్యాలరూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సమస్యల పట్ల అధికారులు సిబ్బంది సమస్యను త్వరితగతిగా పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. మండలంలో 394ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, త్వరలో శంకుస్థాప చేస్తామన్నారు. గంజాయి, మత్తుపదార్థాలు వినియోగించకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో జయలక్ష్మి, సీఐ కె. నాగరాజు, ఎస్ఐ ఎం. రవికుమార్‌పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



మునుగోడులో మొక్క అందజేస్తున్న పర్యావరణవేత్త సురేష్‌గుప్తా

కేతేపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కృషి చేయాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంపై మండలకేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌భూతంతో మన భవిష్యత్‌కు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఏ. సత్తార్, ఆర్ఐ వెంకన్న, పాఠశాల ప్రిన్సిపాల్ పాదర్ సాజీ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ స్థానిక ప్రధాన రహదారిలో స్థానిక హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్లాస్టిక్ వాడకం కారణంగా జరిగే అనార్థాలు, నష్టాలపై సామాజిక పర్యావరణ వేత్త సురేష్ గుప్తా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ భాస్కర్, ఎంపీవో స్వరూపరాణి, హైస్కూల్ హెచ్‌ఎం అంజయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కట్టంగూరులో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు తుమ్మల వీరారెడ్డి

కట్టంగూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. కట్టంగూరులో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యుత్ సంస్కరణల చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్రాలపై పెత్తనాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో చింతపల్లి బయ్యన్న, పెంజర్ల సైదులు, నగేష్, ఆదిమల్ల సురేష్, వంటిపాక సురేష్, పొన్న అంజయ్య, వెంకటమ్మ, అరుణ, చంద్రమ్మ, లింగయ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ప్రధాని మోదీ రైతులు, కార్మికులకు నష్టంచేసే అమలు చేస్తున్న చట్టాలను వ్యతిరేకించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండలంలోని మేటి చందాపురంఇందుర్తి గ్రామంలో రైతు కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో కూలీలకు రోజుకు రూ.600లు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎర్పుల యాదయ్య, రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఏపీలింగోటంలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. కనీస వేతనం, శ్రమకు తగిన ఫలితం, సామాజిక భద్రత లేకుండా కేంద్రం తెస్తున్న కొత్త చట్టాలను నిరసిస్తూ నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు, సహాయ కార్యదర్శి చెర్కు పెద్దులు, దండు నాగ రాజు, మేడి యాదయ్య, వంగూరి లక్ష్మయ్య, పాలకూరి బుచ్చయ్య, సుంకరగోని వెంకటయ్య, కొత్తపల్లి రాములు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఏపీఎం కార్యాలయంలో అందజేశారు. కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో వీవోఏలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు సత్యనారాయణ

కట్టంగూరులో పీర్ల ఊరేగింపు



కట్టంగూరు, జూలై 3(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను పురస్కరించుకొని కట్టంగూరులో గురువారం అయిటిపాముల గ్రామానికి చెందిన పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోబీన్ ఖాన్, మన్సూర్, షకీల్, నాగరాజు, శివ, షేక్ షబ్బీర్, మహ్మద్ మేహరాజ్, హమీద్, సోహేల్, సమీర్, అలీఖాన్, మహ్మద్ పాషా తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి రూ.25 వేల ఆర్థిక సాయం

నల్లగొండ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి జెడ్పిహెచ్ఎస్ పదో తరగతిలో 508 మార్కులు సాధించిన విద్యార్థి ఏరుకొండ సిరికి గ్రామానికి చెందిన బోదనపు రాంరెడ్డి రూ25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన సిరి మంచి మార్కులు సాధించడం గ్రామానికే గర్వకారమన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు ఎడ్ల సైదులు, పాలడుగు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్‌రోకో పోస్టర్ ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం ఈనెల 17న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే రైల్‌రోకో ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం హైద్రాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ లింగం తదితరులు పాల్గొన్నారు.

శాపల్లి నర్సింహస్వామి ఆలయంలో నేడు అభిషేకం

నార్కట్‌పల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి కమలాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం నాగదోశ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకుడు కారంపూడి నర్సింహ్మాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గర్భగుడిలో కొలువై ఉన్న కమలాద్రి లక్ష్మీనర్సింహ్మస్వామి సింహాసనములో గరత్మంతుడు స్థిరనివాసుడై ఉన్నందున ఈ ఆలయంలో నిర్వహించే గరుడ పూజతో భక్తులకు సంతాన లేమి సమస్యలు తొలుగుతాయని చెప్పారు. .

జీపీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక

మునుగోడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఐటీయూ అనుబంధ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల మహాసభను గురువారం నిర్వహించారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన పెరుమాళ్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా బుడిగపాక లింగస్వామి, గౌరవ సలహాదారుడిగా లింగయ్య, సహాయ కార్యదర్శిగా దశరథ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, అండాలు, అరుణ, పెద్దమ్మ, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ(కలెక్టరేట్), జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నల్లగొండ పట్టణంలోని నిరుపేదలు పానగల్లు రోడ్డులోని అనేశ్వరమ్మ గుట్ట సర్వే 33 ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, లెనిన్, మదార్, సుజాత, విజయ, చింత ధనలక్ష్మి, అక్కులయ్య, యూసూఫ్, శంకర్, యేసు, కె. మల్లేష్, లింగయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



పరిశీలిస్తున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి బి. పురుషోత్తం సూచించారు. గురువారం మండలంలోని కొండకింది గూడెం, ఇనుపాముల, కేతేపల్లిల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాదారులు ఇష్టారీతిగా ఎరువులు, పురుగు మందులు విక్రయించకూడదన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలు విధిగా ఈపోస్ యంత్రాల ద్వారానే విక్రయించాలన్నారు. దుకాణాల్లోని ఎరువులు, విత్తనాల నిల్వలకు ఈపోస్ యంత్రాల్లో నమోదైన విక్రయాలకు తేడా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

రామచందర్‌రావు నాయకత్వంలో బీజేపీ మరింత బలోపేతం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును సన్మానిస్తున్న వీరెల్లి చంద్రశేఖర్

నల్లగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన రామచందర్‌రావు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రామచందర్‌రావు నేతృత్వంలో పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేస్తామన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా తయారు చేయాలి

కేతేపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాల తయారీలో బీఎల్‌వోలు కీలక పాత్ర పోషించాలని నకిరేకల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఈఆర్‌వో) జి. వెంకటేశ్వర్లు అన్నారు. బూత్ స్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు గురువారం మండల కేంద్రంని రైతువేదికలో మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాల సవరణ సందర్భంగా ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే వార్డులో ఒకే వరుసక్రమంలో ఉండేలా బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఓటు బదిలీ చేయాల్సి వస్తే బదిలీ అయ్యే ప్రాం తంలో ఓటు తొలగించారా... లేదా అనేది బీఎల్‌లోలు నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యు. రమాదేవి, డీటీ సత్తార్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో క్రిస్టియన్లకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేకల భద్రాద్రి

నల్లగొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో క్రిస్టియన్లకు ప్రాధాన్యం కల్పించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేకల భద్రాది కోరారు. హైదరాబాద్‌లో ఎస్సీ ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. క్రిస్టియన్లు కాంగ్రెస్‌కు అండగా ఉంటున్నారని, గత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అండగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో కూడా క్రిస్టియన్లకు ఎమ్మెల్సీ, పలు నామినేటెడ్ పోస్టులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని, రెండు కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిస్టోఫర్, జయప్రకాష్, మోజెస్, బిషఫ్, సమర్పణ కుమార్, ఇసాక్, ఆశయ్య, ప్రవీణ్, నత్తనీయన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి




నాంపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ డిమాండ్‌చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యాశాఖ బడ్జెట్‌ను 15శాతం పెంచుతామని మేనిఫెస్టోలో చెప్పి ఏడు శాతానికి పరిమితం చేశారన్నారు. ప్రభుత్వ తీరుతో ప్రైవేట్ స్కూళ్ల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై నియంత్రణ లేదన్నారు. విద్యా సంవత్సరం మొదలైన విద్యాశాఖపై సీఎం సమీక్ష చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పొలగోని శ్రీకాంత్, నాంపల్లి శివ, నాంపల్లి శంకర్, పంగ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక గోరింటాకు వేడుకలు

నకిరేకల్, జూలై3, (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసాన్ని పురస్కరించుకుని నకిరేకల్‌లోని వాసవీనగర్‌కు చెందిన కిట్టి గ్రూపు సభ్యులు గురువారం సామూహిక గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షురాలు కడారి అనిత, ముసుకు కవిత, గోలి మంజుల, మూడుదుడ్ల పద్మ, అరుణ, ఇందిర, అంజలి, పద్మ, కమలజ, పుష్ప, సత్యవతి, రమ, లలిత పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 4 జూలై 2025



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	520.20 (149.6410)	58,578	900
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.45 (3.56)	68.78	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	156.035 (21.215)	నిల్	4,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

పోషకాహార లోపంతో ఎవరూ అనారోగ్యం పాలు కావొద్దన్న ఉద్దేశంతో అంగన్‌వాడీకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా కడుపులో బిడ్డ పడిన దగ్గరి నుంచి పెరిగి పెద్దయి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకూ బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నారు. చిన్నారులతోపాటు వారి తల్లులకు కూడా నాణ్యమైన ఆహారం ఇస్తున్నారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా ఇక నుంచి ముఖ గుర్తింపు విధానాన్ని తీసుకొస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పడనుంది.

- (ఆంధ్రజ్యోతి-బీబీనగర్)



అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్



కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలకు చెక్ పడనుంది.అవకతవకలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలనుంచి మూడేళ్లు, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలతోపాటు గర్భిణులు, బాలింత మహిళలకు నెలనెల పౌష్టికాహారం అందించే సమయాల్లో ఫేస్ రికగ్నిజేషన్ (ముఖం ఆధారిత గుర్తింపు)ను తప్పనిసరి చేసింది. కేంద్రాల్లో నకిలీ లబ్ధిదారులను తొలగించి అర్హులైన వారికి మాత్రమే పౌష్టికాహారం అందించి పారదర్శకత పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఈవిధానాన్ని తీసుకొచ్చింది.దీనికోసం ఇప్పటికే పోషణ్ ట్రాకర్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

సెల్‌ఫోన్ ద్వారా ఫేస్ క్యాప్చర్

ఆయా అంగన్‌వాడీకేంద్రాల్లోని లబ్ధిదారులకు సంబంధించిన ఫొటోలు తీసి ఆధార్, కేవైసీ వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. వారికి అందిస్తున్న పోషకాహారం వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతీనెల లబ్ధిదారుడు కేంద్రానికి వచ్చిన తర్వాత ముఖ గుర్తింపు హాజరు తీసుకుని ఆహారం పంపిణీచేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు ఏ సరుకులు పంపిణీ చేశారో నేరుగా లబ్ధిదారుల సెల్‌ఫోన్‌లకు సమాచారం వెళ్లేలా యాప్‌ను రూపొందించారు. తద్వారా పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టేందుకు అవకాశం ఉంది. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు ఉదయం, సాయంత్రం ముఖం ఆధారిత గుర్తింపు

- నకిలీ లబ్ధిదారుల తొలగింపే లక్ష్యంగా ఫేస్ రికగ్నిజేషన్
- పారదర్శక సేవలకు శ్రీకారం

-మిగతా 6వ పేజీలో...

పకడ్బందీగా అమలు చేస్తాం: శైలజ, సీడీపీవో

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నిజేషన్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేస్తాం. ఈ మేరకు అన్ని కేంద్రాల్లో ఫేస్ క్యాప్చర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికే 70నుంచి 80శాతం పూర్తి చేశాం. ఆధార్ గుర్తింపులో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరగా పూర్తి చేసేలా సిబ్బందికి సూచించాం. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విధానంతో పౌష్టికాహారం పంపిణీ పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు మాత్రమే అందే ఆస్కారం ఉంది.



గురుకులాల్లో ఫోన్‌మిత్ర

వివిధ సంక్షేమశాఖలకు చెందిన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇంటిమీద బెంగతో కొంతమేర ఇబ్బందులు పడుతుంటారు. మరికొందరు తల్లిదండ్రులతో ఉన్న అనుబంధం కారణంగా వారితో మాట్లాడలేక, వారిని విడిచి ఉండలేక ఇంటిదారి పడుతుంటారు. కొంత మంది కళాశాలల్లో ఒంటరితనాన్ని భరించలేక, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకుని ఫోన్‌మిత్ర కార్యక్రమానికి ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో శ్రీకారం చుట్టారు. దీంతో విద్యార్థుల్లో భయం పోగొట్టడం, ఇంటిపైన బెంగ నుంచి విముక్తి కల్పించనున్నారు. అందుకోసం యాక్సిస్ బ్యాంకుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా, గురుకుల కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రకారం ఫోన్లు ఏర్పాటు చేశారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట (కలెక్టరేట్)


సూర్యాపేట బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటుచేసిన ఫోన్ ద్వారా మాట్లాడుతున్న విద్యార్థినులు

- ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఏర్పాటు
- ప్రతీ విద్యార్థికి స్మార్ట్‌కార్డ్
- ఫోన్‌మిత్రతో విద్యార్థుల్లో తొలగనున్న ఇంటిబెంగ

ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఫోన్‌మిత్ర పథకాన్ని ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మొదటగా హైదరాబాద్‌లోని గౌలుదొడ్డి గురుకులంలో ఏర్పాటు చేయగా, సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలోని ఎనిమిది తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 'ఫోన్‌మిత్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఒక్కో గురుకుల కళాశాలలో 640 మంది విద్యార్థులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో ఐదు బాలికల, మూడు బాలుర ఎస్సీ గురుకులాలు ఉండగా, ఈ గురుకులాల్లో మొత్తం 5వేల మందికిపైగా విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు.

స్మార్ట్‌కార్డ్‌లో ముందుగానే ఫోన్ నెంబర్లు



గురుకుల కళాశాలల్లో విద్యనభ్యసించే ప్రతీ విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ అందించారు. అందులో ముందుగానే విద్యార్థి తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒకరి ఫోన్ నెంబరుతో పాటు గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి నెంబర్‌ను ముందుగానే ఫీడ్ చేశారు. విద్యార్థులు స్మార్ట్‌కార్డ్ ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం ఉంటుంది. ఫోన్లు చేసినందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. గురుకులాల్లోని ప్రతీ 100మంది విద్యార్థులకు ఒక ఫోన్ చొప్పున ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రతీ రోజు వారికి అవసరం అనుకుంటే సాయంత్రం కళాశాల తరగతులు ముగిసిన అనంతరం 4.30 నుంచి రాత్రి 7గంటల వరకు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసుకునే అవకాశం ఉంది. గతంలో క్లాస్‌టీచర్ (హౌస్ పేరెంట్ టీచర్) ఫోన్ ద్వారా మాత్రమే ఎప్పుడో ఒకసారి అత్యవసరం అనుకుంటే మాత్రమే ఫోన్ సదుపాయం ఉండేది. ఇప్పుడు ప్రతీ రోజు మాట్లాడుకునే అవకాశం కల్పించారు. అదే విధంగా కళాశాలల్లో ఏమైనా సమస్యలు ఉన్నా వెంటనే గురుకులాల రాష్ట్ర కార్యదర్శికి

- మిగతా 6వ పేజీలో...

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్



తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దఅడిశర్లపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మూడు నెలలు డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా గాంధీ విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎన్‌సీ రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్, ఓపీ, మాతా శిశు మరణాల రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడంతో వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి భూభారతి కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నోటీసుల వివరాలను తహసీల్దార్ జయశ్రీ అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు, ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. పెద్దగట్టు సర్వేనెంబర్ 23 వివాదంపై రైతులు దరఖాస్తులు చేసుకోగా, ఆ సర్వే నెంబ్‌ను ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీచేసి ఆ సమయంలో ఎస్‌వో లేకపోవడంతో అక్కడున్న సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, మరుగుదొడ్లను పరిశీలించి, పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ, ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి: ఎస్పీ


డ్యూటీ మీట్‌లో పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన జోనల్ స్థాయి డ్యూటీ మీట్‌లో ఆయన మాట్లాడారు. రోజు రోజుకూ పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కేసుల దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధనలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ తదితర అంశాల్లో పట్టు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలి

వర్షాకాలం నేపథ్యంలో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు సమర్థంగా విధులు నిర్వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం ట్రాఫిక్ పోలీసులకు రెయిన్ కోట్స్, షూస్, గొడుగులు, రేడియం రిఫ్లెక్టివ్ జాకెట్స్, కళ్లద్దాలు, తదితర వస్తువులు సిబ్బందికి అందజేసి మాట్లాడారు. ట్రాఫిక్ పోలీసులు విజుబుల్ పోలీసింగ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తారని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. అప్పుడే ప్రజల్లో పోలీసులపై గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం విధినిర్వహణలో మృతిచెందిన ముగ్గురు హోంగార్డు కుటుంబ సభ్యులకు హోంగార్డు సంక్షేమ నిధుల నుంచి రూ.15వేలు, అనారోగ్య కారణంగా చికిత్స పొందిన ఐదుగురు హోంగార్డ్స్‌కు రూ.10వేలు, పిల్లల వివాహం కోసం ఇద్దరు హోంగార్డులకు రూ.5వేలు, మెరిట్ స్కాలర్‌షిప్ ముగ్గురికి రూ.5వేలు చెక్‌లను ఎస్పీ అందజేశారు. కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, నరసింహాచారి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు శ్రీను, సంతోష్, హరిబాబు, సూరప్పనాయుడు, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి స్టేషన్‌ను తనిఖీచేసిన ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి): కొండమల్లేపల్లి స్టేషన్‌ను బుధవారం అర్ధరాత్రి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో నేర నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాల ప్రాముఖ్యం, సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, దొంగతనాల కట్టడికి పెట్రోలింగ్ చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, ఉమెన్స్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, వివరాలను పరిశీలించారు. ఆయన వెంట సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రధాన కాల్వకు మరమ్మతులెన్నడో?

- ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ పనులకు రూ.442 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- కాల్వ పూర్తి చేయాలంటున్న ఆయకట్టు రైతులు


ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ కోతకు గురై పెరిగిన కంపచెట్లు

దేవరకొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతోపాటు 516 గ్రామాలకు తాగు నీరు అందించేందుకు ఉద్దేశించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు 2001లో ప్రారంభించినప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. ఏఎమ్మార్పీ పుట్టంగండి నుంచి ఉదయ సముద్రం వరకు 136 కిలోమీటర్ల మేర కాల్వ విస్తరించి ఉంది. దీంతోపాటు డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలు కంపచెట్లు పెరిగి నీరు వృథాగా పోయే పరిస్థితి నెలకొంది. నాలుగు మోటర్లు నడిస్తే నీరు వృథా పోతుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు మోటర్ల ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడమే లక్ష్యంగా ప్రాజెక్టును ప్రారంభించారు. ఏఎమ్మార్పీ కాల్వలకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. అధికారులు ప్రతి సంవత్సరం ప్రతిపాదనలు పంపుతున్నారే తప్ప మరమ్మతులు చేయడం లేదు.

కాంగ్రెస్ హయాంలో నిధులు మంజూరు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌లు దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం, ఏఎమ్మార్పీ, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులపై దృష్టి సారించారు. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచని ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం రూ.442 కోట్లు కేటాయించింది. కానీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తుండడం, శ్రీశైలం నుంచి సాగర్ నీటి విడుదల ప్రారంభమైంది.

మరమ్మతులు పూర్తయితే చివరి వరకు నీరు

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 136 కిలోమీటర్ల మేర సీసీలైనింగ్ పనులు, కంపచెట్ల తొలగింపు, మరమ్మతులు పూర్తయితే చివరి భూములకు సాగునీరు అందనుంది. ప్రభుత్వం టెండర్లు పిలిచి మరమ్మతులు పూర్తిచేసి లీకేజీలను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు ప్రభుత్వం రూ.442 కోట్ల నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్లు పూర్తయితే మరమ్మతులు ప్రారంభమవుతాయి. నీరు వృథా కాకుండా చర్యలు చేపడుతున్నాం.

- సత్యనారాయణ, ఏఎమ్మార్పీ ఈఈ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్
- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



మిర్యాలగూడలో డీఏవో శర్మకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

మిర్యాలగూడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదలకోసం కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఏవో శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వాల భిక్షకాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా రూ.7200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. నిధులు లేవంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు నిధులు చెల్లిస్తున్నా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ప్రపంచ అందాల పోటీలకు రూ.200కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలే పవన్, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళీ, నాయకులు ఎస్‌కే సోయల్, మాధవి, స్వాతి, ఉమామహేశ్వరి, స్వప్న, రాజు, వెంకటేష్, ప్రభాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జ్వాలా వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల కన్వీనర్ బీసం రామయ్య, విద్యావంతుల వేదిక నాయకులు హరి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బొంగరాల నర్సింహనాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన

నార్కట్‌పల్లి: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడానికి నిరసనగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాందేవ్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్థలం కేటాయించి పక్కా భవనం నిర్మించాలని రెండేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జీవో నెం.29ని రద్దుచేసి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షా యాభైవేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, కావటి సత్యనారాయణ, మల్లేశ్, శిరీష, వైష్ణవి, రమాదేవి, సుకుమార్, వారాహి, మనీషా, మానస పాల్గొన్నారు.


రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి


ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. ఎవరైనా ఎమ్మార్పీకి మించి అధిక ధరకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, నాసిరకానికి చెందినవి విక్రయించినా చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు చేయాలన్నారు. రైతులు చేసిన ప్రతీ కొనుగోలుకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మండలంలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎక్కువ మొత్తంలో కాకుండా అవసరం ఉన్నంతవరకే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో ఎ.శివరాంకుమార్, తదితరులు ఉన్నారు.

వారంలో సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 3 (ఆంధ్రజ్యోతి): యాసంగి 2023-24కు సంబంధించి మిగిలి న కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని వా రంలోపు పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ జిల్లా రైస్ మిల్లర్లను ఆదేశించారు. రైస్ మిల్లర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 యాసంగి సీఎంఆర్‌కు సంబంధించి ఇంకా 73 ఏసీకే చెల్లించాల్సి ఉందన్నారు. మిల్లర్లు వారం రోజుల్లో ఈ మొత్తాన్ని చెల్లించడంతోపాటు, 2024-25 యాసంగికి సంబంధించిన సీఎంఆర్‌ను సైతం వేగవంతం చేయాలన్నారు. సీఎంఆర్ చెల్లింపులో నిర్లక్ష్యం చేయవద్దని, పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు దీన్ని నిత్యం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికా రి వెంకటేశం, జిల్లా మేనేజర్ హరీష్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో అంతకుముందు నిర్వహించిన నాగార్జున సాగర్ నియోజకవర్గ బూత్‌స్థాయి అధికారుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, డీటీ మల్లిఖార్జున, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరచర్ల, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో కొత్త పీటీఆర్ పని జరుగుతున్నందున శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అబ్దుల్లా హబీబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బొత్తలపాలెం, వాచ్యాతండా ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సహకరించాలని కోరారు.

నోట్ బుక్స్, బ్యాగుల పంపిణీ

కొండమల్లేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చెట్ల శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు గురువారం నోట్ బుక్స్, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నోట్ బుక్స్ బ్యాగులు అందించిన దాతను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉదయ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

తిరుమలగిరి(సాగర్), జూలై 3(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఏర్పాటులోభాగంగా పునరావాసం కల్పించిన రైతుల సమస్యలు పరిష్కరించాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలువురు రైతులు కలిసి తమ సమస్యల గురించి విన్నవించుకున్నారు. ఎల్లాపురం శివారులోని సర్వే నెం.255లో చకోలం తండా, సుంకిశాలతండా గిరిజన రైతులకు బీఫాం పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు, వ్యవసాయ రుణాలు పొందలేక తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఆయా గ్రామాల్లో ఇటీవల సర్వే నిర్వహించినప్పటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు నేటికి అందలేదని వారు ఆయనకు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రమావత్ రమేష్‌నాయక్, గిరిజన నాయకులు జటావత్ లాలు, రమావత్ లాలునాయక్, కెలావత్ హనుమంతు, మెగావత్ భాస్కర్, సపావత్ కృష్ణ, పాల్తి నరేష్, ఉపేందర్, రాము తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రం పనులు పరిశీలన

హాలియా: హాలియాలోని బొడ్రాయిబజార్ సమీపంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం భవన నిర్మాణ పనులను గురువారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ పరిశీలించారు. భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత సెంటర్ ఎదుట ఉన్న మురుగు కాల్వపై సీసీ వర్క్ చేయాలని ఎంఈవో గుండా కృష్ణమూర్తి అదనపు కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించి ఆయన సీసీ వర్క్ చేయాలని కమిషనర్ రామదుర్గారెడ్డికి ఆదేశాల జారీ చేశారు. అంతకు ముందు పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో చేపడుతున్న రేకుల షెడ్డు పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి, కమీషనర్ రామదుర్గారెడ్డి, కెజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హై



దామరచర్ల : మండల శివారులో ప్రభుత్వ భూమిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

దామరచర్ల :ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మండల శివారులోని సర్వే నెం.735లో గల 35.06 ఎకరాల ప్రభుత్వ భూమిని గురువారం ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఈ సర్వే నంబర్‌లోని 13 ఎకరాల భూమిని స్వాతంత్ర్య సమరయోధుల పేరిట అక్రమ పట్టాలు సృష్టించి స్వాహా చేసేందుకు కొందరు ఆక్రమణదారులు యత్నించారని, విచారించగా నకిలీ అని తేలడంతో సంబంధిత పట్టాను సైతం రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఇదే భూమిలో గతంలో సైతం 5 ఎకరాల్లో వెంచర్ వేయగా వాటిని సైతం తొలగించినట్లు తహసీల్దార్ జవహర్‌లాల్ సబ్ కలెక్టర్‌కు వివరించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను, రికార్డులన మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ సతీష్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : ఎస్ఐ



వ్యాపారులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ

కొండమల్లేపల్లి,జూలై 3 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని ఎస్ఐ అజ్మీర రమేష్ కోరారు. గురువారం ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా రోడ్లపై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని చెప్పారు. అలాగే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇక రోడ్లపై వ్యాపారులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాంగ్రెస్ సమ్మేళనం జయప్రదం చేయాలి

దేవరకొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ గ్రామ, పట్టణ స్థాయి సమ్మేళనం విజయవంతం చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా నిర్వహించే సమ్మేళానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమ్మేళనానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే హాజరుకానున్నట్లు వివరించారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కేకే.జయరాజన్ అన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన పాఠశాల 9వ తరగతి విద్యార్థి కేతావత్ శ్రీధర్‌ను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో నిర్వహించిన అండర్ -14 ట్రై-అథ్లాన్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన శ్రీధర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 6 నుంచి వరంగల్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జయరాజన్, హెచ్ఎం సుజయ్‌కుమార్, పీఈటీ నీలం రమేష్, శంకర్ పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలను నిర్లక్ష్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఆదాయ మార్గాలను నిర్లక్ష్యం చేయరాదని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా గురువారం అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆస్తి, నల్లా, పన్నులు సకాలంలో చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణ పరిధిలోని వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చూడాలని, ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చగా ఉంచేందుకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో జ్ఞానేశ్వరి, వెంకటరమణ, అంజి పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

పెద్దవూర, జూలై 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పులిమాల కృష్ణారావు ఇటీవల హైదరాబాద్‌లో దళితరత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రం పలువురు దళిత సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బొంగరాల వెంకటేశ్వర్లు, ఆదాసు విక్రమ్, అయితబోయిన వెంకటయ్య, గాలి సైదిరెడ్డి, లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మార్కెట్ కమిటీ ఉద్యోగులు

మిర్యాలగూడ రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై ఆ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దాడి చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఎదుట మార్కెట్ కమిటీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం మిర్యాలగూడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా మార్కెటింగ్ శాఖ మంత్రి, డైరెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో మార్కెట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బి.మధుబాబు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటేశం, సూపర్‌వైజర్లు శ్రీహరి, శ్రీకాంత్, సుజాత, రమా, ఉమా, స్రవంతి, చెన్నానాయక్, రవి, నాగార్జునచారి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

తిరుమలగిరి(సాగర్), జూలై 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని విద్యాదాన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్, రియల్ ఫేజ్ కంపెనీ డైరెక్టర్ ఈదర ప్రసన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు విద్యార్థులు పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏకే ఫౌండేషన్ ఛైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత, ఉపాధ్యాయినిలు హిమబిందు, కృష్ణవేణి, పుష్పలత, విమల, బ్యులా, శిరీష, విజయ్, ఫౌండేషన్ సభ్యులు మన్నెం కోటి, శేఖర్‌గౌడ్, ఎం.అనిల్, రామలింగయ్య, మహేష్, వరుణ్, సుమన్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి.. పుస్తకాలు పంపిణీ చేసి..

● ఘనంగా ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలు

దేవరకొండ, చింతపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దేవరకొండలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్‌నాయక్, నల్లగాసు జాన్‌యాదవ్, పున్న వెంకటేశ్వర్లు, శిరందాసు కృష్ణయ్య, హనుమంతు వెంకటేష్‌గౌడ్, తిప్పర్తి రుక్మారెడ్డి,యూనుస్, మురళి, నిరంజన్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు



దేవరకొండలో కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



చింతపల్లి : వీ.టీ నగర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న మాజీ ఎంపీపీ భవాని పవన్‌కుమార్

● చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్(మాల్)లో గురువారం మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కూరగాయాల మార్కెట్‌లో రైతులకు అల్పాహారం పంపిణీ చేశారు. గొడుకొండ్ల, వీ.టి.నగర్ ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంగిరేకుల గోవర్ధన్, పూరె లక్ష్మణ్, మాస భాస్కర్, రామిని నగేష్, ఖలీల్, మద్దెల కృష్ణగౌడ్, అల్వాల జంగయ్య, లగ్గోని యాదయ్య, పాల్గొన్నారు. అలాగే కొండమల్లేపల్లి, డిండి, నేరేడుగొమ్ము మండలకేంద్రాల్లో నాయకులు కేక్ కట్ చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

నాగార్జున సాగర్,జూలై 3(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని గురువారం సాగర్ పోలీసులు అరెస్టు చేశారు. సాగర్ సీఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. చందంపేట మండలం జగ్గతండాకు చెందిన రమావత్ రాము జల్సాలకు అలవాటు పడి ఇళ్ల వద్ద పార్కు చేసి ఉన్న బైక్‌లను దొంగిలించి విక్రయిస్తుంటాడు. యఅఇతే రాము గత నెల 3వ తేదీన సాగర్ ఫైలాన్ కాలనీలో దొంగిలించి ఇంట్లో దాచిపెట్టి ఏపీలోని మాచర్లలో విక్రయించడానికి వెళ్తున్నాడు. గురువారం ఉదయం సాగర్ ఫైలాన్ కాలనీ కొత్త వంతెన వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి రాము బైక్‌ను వెనకకు తిప్పుకొని పారిపోతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతడిని పట్టుకొని విచారించగా బైక్ దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు చెప్పాడు. అంతేకాకుండా గత నెల మొదటి వారంలో ఇంకో బైక్ దొంగిలించినట్లు ఇంట్లో ఉన్నట్లు చెప్పారు. దీంతో నిందితుడి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని నిందితున్ని నిడమనూరు కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. నిందితుడికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య

మిర్యాలగూడలో వ్యభిచారగృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని వ్యభిచార గృహంపై గురువారం పోలీసులు దాడి నిర్వహించి ఆరుగురు మహిళలు, ఇద్దరు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం గూడూరు గ్రామశివారులోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న ఇద్దరు మహిళలు అద్దెకు తీసుకొని వ్యభిచారం చేస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసినట్లు చెప్పారు. ఎట్టుబడ్డ మహిళలు, విటులు పట్టణానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. మహిళల నుంచి 4 సెల్‌ఫోన్లు, రూ. వెయ్యి నగదు స్వాధీనపచ్చుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గురుకులాలను బలోపేతం చేయాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలను బలోపేతం చేయాలని బీసీ విద్యార్థి సంక్షేమ సంఘాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు పగిడి జీడయ్యయాదవ్, తిరుమలగిరి అశోక్ కోరారు. ఈ మేరకు గురుకులాల స్టేట్ సెక్రటరీ బడుగుల సైదులుకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం, వసతితో పాటు మెరుగైన విద్యనందించే గురుకులాలు నిర్మాణాత్మకంగా ఉండాలన్నారు. బీసీ గురుకుల ప్రస్తుత రీజనల్ కోఆర్డినేటర్ విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని సెక్రటరీకి ఫిర్యాదు చేశామన్నారు. గురుకులాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పద్ధతి పాటించడం లేదని, బీసీ అభ్యర్థులకు దక్కాల్సిన వాటాను దక్కకుండా చేస్తున్నాడని ఆరోపించారు. నిబంధనలు పాటించని ఆర్సీవోను తొలగించాలని, బీసీ గురుకుల ఆర్సీవోగా బీసీ అధికారిని నియమించాలని సెక్రటరీని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పగిళ్ల సతీష్, చిలకల మురళీ, చిమట రవి, నాగరాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నాగార్జునసాగర్,జూలై3(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఫైలాన్ కాలనీకి చెందిన బత్తుల విజయలక్ష్మి(19) గత నెల 28 వ తేదీ నుంచి కనబడటం లేదని సాగర్ ఎస్ఐ ముత్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలి : ఎస్ఎఫ్ఐ

మిర్యాలగూడ, జూలై 3(ఆంధ్రజ్యోతి): అవంతిపురం గిరిజన పాఠశాలకు మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదానాయక్ కోరారు. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, పాఠశాల టైంటేబుల్‌ను ఏర్పాటు, పరీక్షల నిర్వహణ, విద్యార్థినులకు ఎదురయ్యే సమస్యలపై పరిశీలన తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జగన్‌నాయక్, అనిల్, నాయకులు అఖిల్, బన్ని, మణి, తరుణ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిస్తా

చింతపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించేదుకు కృషి చేస్తానని మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. డాక్టర్స్‌డే సందర్భంగా గురువారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎండి.మజహర్ అలీబేగ్(పాషా) ఆధ్వర్యంలో వైద్యాధికారిని శాలువాలతో సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వంగూరు శ్యాంసుందర్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా చూడాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా పేర్లు తప్పులు దొర్లకుండా చూడాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి బీఎల్‌వోలకు సూచించారు. దేవరకొండ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం బీఎల్‌వోలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నూతన ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. బీఎల్‌వోలు 18 ఏళ్ల నిండినవారందరికీ ఓటరుగా నమోదు చే యాలని కోరారు. కొత్త ఓటర్లను కూడ గుర్తించాలన్నారు. మృతి చెందినవారి పేర్లను తొలగించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ట్రైనర్ శ్రీనివాస్, రమేష్, గోవర్ధన్‌రావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



దేవరకొండలో ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, జూలై3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయా లని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. గురువారం దేవరకొండలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం పురస్కరించుకొని మునిసిపల్‌శాఖ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధించాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే జరిమానాలతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, ఏఈ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దాం

తిరుమలగిరి(సాగర్),జూలై 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులమంతా కలిసి కృషి చేయాలని ఎంఈవో కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వడ్త్యారాజు నేతృత్వంలో పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు, నోట్ పుస్తకాలు సకాలంలో అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎరనాగుల సైదులు ఎ.సైదులు, గంజి శ్రీదేవి, వినయ్‌కుమార్, నాగమణి, రాజేష్, శైలజ, అమరయ్య సహదేవా ఉన్నారు.

ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

● వైద్యుల నిర్లక్ష్యంతోనే కారణమంటూ నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న మృతుడి బంధువులు

మిర్యాలగూడ అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడన్ని ఆరోపిస్తూ అతడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మిర్యాలగూడలో పట్టణంలో గురువారం జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం కొత్తనందికొండ గ్రామానికి చెందిన సుంకిశాల ముత్తయ్య(60)కు ఛాతీలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం ఈనెల 1వ తేదీన పట్టణంలోని రివర్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా వృద్ధుడి పరిస్థితి విషమించింది. దీంతో వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో గురువారం మృతి చెందాడు. అయితే రివర్ ఆస్పత్రి వైద్యులు సకాలంలో వైద్యం అందించకపోవడంతో ముత్తయ్య మృతిచెందాడని ఆరోపిస్తూ రోగి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారమివ్వడంతో వన్‌టౌన్ సీఐ మోతీరాం సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆస్పత్రి నిర్వాహకులు, మృతుడి బంధువులతో చర్చించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకున్నారు. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా రోగి మృతికి తమ నిర్లక్ష్యం ఏమీలేదని, గుండెపోటు తీవ్రత పెరగ్గా, చికిత్స అందిస్తుండగానే పరిస్థితి విషమించిందని చెప్పారు.

9న సమ్మెను జయప్రదం చేయాలి

కొండమల్లేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య కోరారు. గురువారం సమ్మె నోటీసును ఈవో డాకునాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఓడపల్లి యాదగిరి, వస్కుల అలివేలు పాల్గొన్నారు.

బీజేపీలోనే కొనసాగాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి):బీజేపీలోనే కొనసాగాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కోరినట్లు ప్రముఖ వాస్తు సిద్ధాంతి, వీహెచ్‌పీ నేత మామిడి సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశం, ధర్మం కోసం అహర్నిశలు పాటుపడే రాజాసింగ్ లాంటి నాయకుడు బీజేపీకి అవసరమన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : మార్గన్ / వెంకటేశ్వర: కన్నప్ప / రాఘవ: కుబేర / విట్రోస్: కుబేర, మార్గన్, దేవరకొండ : మనోజ్ : కుబేర మైత్రి వెంకటేశ్వర : కన్నప్ప